అతిసారం.. జాగ్రత్తలతోనే దూరం!

అతిసారం లేదా డయేరియా కొన్ని రకాలైన బ్యాక్టీరియా, ప్రోటోజోవాల ద్వారా కూడా వస్తుంది. ఐదేళ్ల లోపు పిల్లల్లో జరిగే మరణాలకు అతిసారం రెండో ప్రధాన కారణం, ఇది భయంకరమైన వ్యాధి కాకపోయినా దీని కారణంగా మరణాలు కూడా సంభవిస్తున్నాయి. చిన్న జాగ్రత్తలతో కూడా దీని బారి నుంచి బైటపడవచ్చు.

- వాతావరణ మార్పులతో లక్షణాలు
- వైద్యుల సూచనలు పాటించాలంటున్న నిపుణులు



వరదయ్యపాలెం మండలం కుప్పట తాగేలిలో దోమలు మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: సీజన్ మారినప్పుడు లేదా వర్షాలు కురుస్తున్నప్పుడు జ్వరం, దగ్గు, జలుబు వంటి రుగ్మతలు ఇబ్బంది పెడతాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, వాతావరణంలో మార్పులు, తాగునీటి కలుషితం, ఇతర వైరస్‌ల వల్ల డయేరియా విజృంభిస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి

విరేచనాలు ఎక్కువగా అయ్యి శరీరంలోని నీటి శాతం తగ్గి, బీపీ తగ్గి శరీర భాగాలకు ప్రధానంగా మూత్రపిండాలు, మెదడుకు రక్తప్రసరణ తగ్గినప్పు డు ప్రాణహాని కలిగే పరిస్థితి ఉంటుంది. ప్రధాన లవణాలైన సోడియం, పొటాషియం తగ్గిపోయి, తీవ్రమైన బలహీనతకు గురై, అపస్మారక స్థితికి చేరుకోవచ్చు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే తొందరగానే దీని నుంచి బయటపడొచ్చు.

ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

నీళ్ల విరేచనాల వల్ల శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి పునరుద్ధరణ చేయాలంటే గ్లూకోజ్, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్ల లాంటివి తీసుకోవాలి. ఎలక్ట్రాల్ పొడి కలిపిన నీళ్లు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం లాంటివి తాగితే శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి పొందుతుంది. అనంతరం విశ్రాంతి తీసుకుంటూ డాక్టరు సూచించిన మందులు వాడితే వాంతులు, విరేచనాలు తగ్గుతాయి.

గత ఏడాది పలుచోట్ల డయేరియా కేసులు

సత్యవేడు నియోజకవర్గంలోని పలు గ్రామాలు డయేరియా బారినపడ్డాయి. కేవీబీపురం మండలం కళత్తూరు, వరదయ్యపాళెం మండలం నాగనందాపురం గ్రామాల్లో డయేరియా విజృంభించడంతో పలువురు వాంతులు, విరేచనాలు, జ్వరంతో అవస్థలు పడ్డారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



అతిసారం బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాంతాలు సందర్శించి కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని అవగాహన కల్పించాం. ఇప్పటి వరకు ఎలాంటి అతిసారం వ్యాధి కేసులు నమోదు కాలేదు. ఈ వ్యాధి నివారణకు చికిత్సను పీహెచ్‌సీలో చేస్తాం.

– డాక్టర్ ద్వైత, పీహెచ్‌సీ, వరదయ్యపాళెం

క్లుప్తంగా

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రేవతి



రేవతిని సన్మానిస్తున్న యూనియన్ నేతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రేవతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మునిచంద్ర తిరుమల డిపోకు బదిలీ అయ్యారు. మదనపల్లి డిపోలో విధులు నిర్వహిస్తున్న రేవతి ఇక్కడికి వచ్చారు. ఆమెను యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు.

కృష్ణారెడ్డికి నివాళి



కృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని 33వ వార్డుకు చెందిన రేణిగుంట కృష్ణారెడ్డి శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, జైకృష్ణారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, శరవణరెడ్డి, మున్నాస్వామి, శంకర్, ఆర్కాడు శంకర్ పాల్గొన్నారు.

బడిబాట పట్టిన డ్రాపౌట్స్



విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన కాటూరు గ్రామ పంచాయతీ ఓటవాని చెరువు గిరిజనకాలనీలో డ్రాపౌట్స్ ఇళ్లకు వెళ్లారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను మళ్లీ స్కూలుకు పంపాలని వారిని ఒప్పించారు.

బయో ఫెర్టిలైజర్లతో అధిక దిగుబడి

బుచ్చినాయుడుకండ్రిగ: నానో యూరియా, డీఏపీ, బయో ఫెర్టిలైజర్లు పంటలకు వాడితే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయాధికారి షణ్ముగం అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన రైతులకు నానో యూరియా, డీఏపీలపై జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అర్ధ లీటర్ నానో యూరియా, డీఏపీలు ఒక బస్తా యూరియా, డీఏపీలతో సమానమని తెలిపారు. బయో ఫెర్టిలైజర్ల వల్ల భూమికి అందే వివిధ పోషకాల గురించి తెలియజేశారు.

అధ్యాపకురాలికి ఘన సన్మానం



అధ్యాపకురాలు కుమారి నీరజను సత్కరిస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలు కుమారి నీరజను శుక్రవారం అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆమె ఇటీవల విజయవాడలో సీఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు అందుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ దీనదయాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, రామచంద్రారెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ సుకుమార్ రెడ్డి, నరసింహ వర్మ, శ్రీకాంత్‌రెడ్డి, నరసింహారావు, మాలతి పాల్గొన్నారు.

నత్తం హరిబాబుకు దళిత వీర్ అవార్డు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, దళిత బహుజన ఫ్రంట్ రాయలసీమ కో–ఆర్డినేటర్ నత్తం హరిబాబు దళిత వీర్ అవార్డు అందుకున్నారు. గుంటూరులోని బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో ఈ నెల 10న దళిత పల్లె వీరుల మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ భావజాలంతో దళితులకు అండగా ఉంటూ మానవ హక్కుల పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నందుకు నత్తం హరిబాబుకు అవార్డు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, మాజీ మంత్రి డొక్కామాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

డ్వాక్రా రుణాల పంపిణీ

వెదురుకుప్పం: డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే థామస్ చేతులమీదుగా రుణాలు పంపిణీ చేసినట్లు ఏపీఎం పరశురామరెడ్డి తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పంలో చెక్కులను అందించినట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున శనివా రం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ, బీరకుప్పం, నాగలాపురం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ రమేష్‌చంద్ర తెలియజేశారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



రవిచంద్ర

రేణిగుంట: ఎంపీడీవో రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి బదిలీపై వెళ్లడంతో డిప్యూటీ ఎంపీడీవో ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పాకాలలో ఏవోగా పనిచేస్తున్న రవిచంద్ర పదోన్నతిపై రేణిగుంట ఎంపీడీవోగా వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక దళితవాడ సర్పంచ్ గంగాధరం మేనకోడలు యానివిశిష్ట, అనోల్ వివేక్‌కు వివాహం జరిగింది. నూతన వధూవరులను శుక్రవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆశీర్వదించి జ్ఞాపిక అందజేశారు. ఆయన వెంట సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, సర్పంచ్ గంగాధరం, ఎంపీటీసీ భరత్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, జయశ్యామ్‌రాయల్, మున్నా రాయల్, సుమన్, మస్తాన్, శంకర్, రవీంద్ర నాయుడు, వెంకటయ్య, ఈశ్వరయ్య, రమణయ్య తదితరులు వున్నారు.

ఏర్పేడు ఎంపీపీగా జమల్ల శ్రీనివాసులు



బాధ్యతలు చేపడుతున్న జమల్ల శ్రీనివాసులు

ఏర్పేడు: ఏర్పేడు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీ జమల్ల శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ గీత ఇటీవల వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను జెడ్పీ సీఈవో ఆమోదించారు. ఈ క్రమంలో వైస్ ఎంపీపీ జమల్ల శ్రీనివాసులును ఎంపీపీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం ఏర్పేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో సౌభాగ్యం, ఏవో కోమలేశ్వరి, ఈవోపీఆర్‌డీ రమణకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



కయ్యూరు బాలసుబ్రమణ్యంను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొట్టంబేడు: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న దిగువ సాంబయ్యపాలెంలోని ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రమణ్యంను శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ బాల సుబ్రహ్మణ్యం కవిగా, రచయితగా, మిమిక్రీ కళాకారుడిగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షుడు ఆంటోనీ, బాలాజీ, అరుణ్, మహేష్, చిరంజీవి, అల్లావుద్దీన్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్య పరీక్షలు



పిల్లలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఇందులో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు, తొట్టంబేడు, సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ మండలాల్లోని ప్రత్యేక అవసరాలు కల పిల్లలు 130 మంది పాల్గొన్నారు. వైద్య సిబ్బంది వారిని పరిశీలించి వారికి అవసరమైన పరికరాలను నిర్ధారించారు. డీఈవో కేవీఎన్ కుమార్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్, ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎంవో సురేష్, ఏటీఎం సుధాకర్ నాయుడు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ నాయుడు, బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటయ్య, ఎంఈవోలు శ్రీకాళహస్తి భువనేశ్వరి, బాలయ్య, తొట్టంబేడు ఎంఈవో 2 భాస్కర్, డాక్టర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నేతలు

శ్రీకాళహస్తి: పెండింగులో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం శ్రీకాళహస్తిలో ధర్నా చేశారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్.కె జాకీర్, సమీర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చేతిబోరుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు పంచాయతీ ఎన్‌టీఆర్ నగర్ ఎస్సీ కాలనీలోని తాగునీటి చేతిబోరుకు సర్పంచ్ పాలవేణి మరమ్మతులు చేయించారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 4న 'నీళ్ల కోసం బోరుమంటున్నారు' శీర్షికతో ప్రచురించిన కథనంపై సర్పంచ్ స్పందించారు. బోరు మెకానిక్ సుబ్రమణ్యంతో మరమ్మతులు చేయించారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కేంద్ర సహాయమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ దర్శించుకున్నారు. వారికి అధికారులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వెంకటస్వామి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా 'హిందీ దివస్'



బహుమతులు పొందిన విద్యార్థులతో టీచర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ నెల 14న హిందీ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ మాధవీలత విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్‌ఎం వాణి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ, హిందీ మన జాతీయ భాష అని, పాఠశాలల్లో త్రిభాషా సూత్రాన్ని అమలు చేస్తూ భాషల ఆవశ్యకతను ప్రభుత్వాలు గుర్తిస్తున్నాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రముఖ హిందీ రచయితల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం, సుజన తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలను నివారించాల్సిన అవసరం ఎంతో వుందని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ తెలిపారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14వ వరకు గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి చెందిన పురోహితులు, సిబ్బంది, పెద్ద మసీదులోని ఖాజీ, ఇమామ్, ముస్లిం మత పెద్దలతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అర్చకులు ఆనంద స్వామి, రామస్వామి, జయస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, ఏఈవో విద్యాసాగర్, మోహన్, సుబ్బయ్య గిరిజన రాష్ట్ర సలహాదారుడు వజ్రం కిషోర్, కౌన్సిలర్ మాధవ మహేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

వరదయ్యపాళెం: బాల్య వివాహాల వల్ల అనర్థాలు సంభవిస్తాయని సీడీపీఓ దేవకుమారి అన్నారు. శుక్రవారం బత్తలవల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భేటీ బచావో...భేటీ పడావో ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలు యుక్త వయసులో పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడరన్నారు. పిల్లలను విద్యలో ప్రోత్సహించరాదని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఎం జయసుధ, ఎంపీహెచ్ఈఓ రవీంద్రుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

స్కిట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, వీసీ



స్కిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వైస్ చాన్సలర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఇంజినీరింగ్ కళాశాలను శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శన్ రావు పరిశీలించారు. కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు కల్పించిన వసతులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మూడో విడత కౌన్సిలింగ్‌లో స్థానిక విద్యార్థులందరూ స్కిట్ కళాశాలను ఆప్షన్ కింద నమోదు చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడానికి ఆలయ ఈవో అంగీకరించారని తెలిపారు.

ఎస్‌బీఐ సేవలు సద్వినియోగం చేసుకోండి

కేవీబీపురం: స్టేట్ బ్యాంక్‌లో ఖాతా కలిగినవారు ఈకేవైసీ చేసుకోవాలని ఆర్‌బీఐ డైరెక్టర్ బషీర్ కోరారు. మండలంలోని పవనివారి కండ్రిగలో ఎస్‌బీఐ ముఖ్య ప్రతినిధులు, ఖాతాదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అపరిచితుల ఫోన్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీలను చెప్పరాదని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ అమరావతి, దినేష్, తిరుపతి పరిపాలన అధికారి రవికుమార్, ఎల్‌డీఎం మేనేజర్ స్వామి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ నరేష్, ఎస్ఎస్‌జీ సభ్యులు, ట్రైనీ ఎస్ఐ ఇమ్మానుయేల్, సర్పంచులు పెంచలయ్య, విజయ్, ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఏచూరి ఆదర్శం

సత్యవేడు: యువతకు సీతారాం ఏచూరి ఆదర్శవంతుడని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్ధన్ అన్నారు. శుక్రవారం ఏచూరి వర్ధంతి పురస్కరించుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి సీపీఎం నాయకులు ఘన నివాళి అర్పించారు. ఆయన సేవలను స్మరించారు. కార్యక్రమంలో సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి ఎం.రమేష్, అరుణాచలం, మునస్వామి, మురళి, కృష్ణయ్య, తిరుపాల్ రెడ్డి, లక్ష్మి, సుశీలమ్మ, కృష్ణయ్య, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: సీపీఎం మండల కార్యదర్శి మురుగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి వర్ధంతి నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అముదమ్మ, దక్షిణామూర్తి, పద్మ, మేఘన, ఉమ, వల్లెమ్మ పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను ప్రకటించాలి

తొట్టంబేడు: ఉద్యోగ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పెండింగులో వున్న డీఏలు విడుదల చేయాలన్నారు. మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించాలని, ఈహెచ్ఎస్‌ను రూ.25 లక్షలకు పెంచాలని కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ బి.నారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామదాసు, ఉదయ్ కుమార్, తిరుపతి జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు బి.మురళీకృష్ణ, మండల బాధ్యులు శివ, సుబ్రమణ్యం రెడ్డి, పెరుమాల్, సుమలత, పద్మావతి, పద్మలత, భాస్కర్ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించరూ!

కేవీబీపురం: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గురునాథం, గౌరవాధ్యక్షుడు గజేంద్రయ్య, జిల్లా కౌన్సిలర్ మురళి, నాగరాజు, రవి, విజయభాస్కర్, జనార్ధన్, మునస్వామి, నటరాజ్, వెంకటరావ్ పాల్గొన్నారు.